డేంజర్ ఫుడ్..!

- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్లు
- ప్యాకెట్లతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపంగా మారుతున్న ప్యాకెట్ ఫుడ్స్
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు

గడివేముల: చిరుతిండ్లతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వల్ల భవిష్యత్ పెనుముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా మార్కెట్‌లోకి కల్తీ ఆహార పదార్థాలు

ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి మండలంలో ప్రతిరోజూ వేలాది రూపాయల్లో వ్యాపారం జరుగుతోందనేది నగ్నసత్యం. వీటిపై కనీస తనిఖీ లేకపోవడంతో ఎవరిష్టం వారిది అన్నట్లుగా పరిస్థితి తయారైంది.


గడివేములలోని ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన చిరుతిండ్ల ప్యాకెట్లు

నాసిరకం చిరుతిండ్లు తింటే రోగాలొస్తాయి



నాసిరకం చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు కూడా వినియోగిస్తారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తప్పవు.

–డాక్టర్ కిరణ్‌కుమార్, గడివేముల

అవగాహన కల్పించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు ఇవ్వకుండా ఇళ్లలో ఆ తర్వాత పాఠశాలల్లో నివారించాలి. సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమేడ్ జోలికి వెళ్లకుండా పిల్లలను ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– డి.యాసిన్, గడివేముల

చిరుతిండ్లకు దూరంగా ఉండాలి

నాణ్యత లేని చిరుతిండ్లు చిన్నారులే కాదు.. పెద్దలు కూడా తినకూడదు. పిల్లలు మారం చేయడం వల్ల తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా వాటిని కొని పిల్లలకు ఇస్తున్నారు. అలా చేయడం ద్వారా చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, ఉప సర్పంచ్, గడిగరేవుల

క్లుప్తంగా

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: స్థానిక మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈఓ రామలింగారెడ్డి ఏర్పాట్లు చేశారు. వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: అర్హులైన పేదలందరికీ షరతులు లేకుండా ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్ ఆటో స్టాండ్ నుంచి వార్డు సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. పేదలు నిర్మించుకునే గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, నాయకులు సోమన్న, పావని, రబియా, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. వడిబియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

నీటి పొదుపు అందరి బాధ్యత


కందహాల్ ఎస్సీ కాలనీలో నీటి సమస్య తెలుసుకుంటున్న ఏఈ

సి.బెళగల్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. గ్రామస్తులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ మాధురి ఉన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళవారం కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇ.తాండ్రపాడు, ఉల్చాల, మునగాలపాడు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు జరిపి 128 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మునగాలపాడు గ్రామంలో వెంకటేశ్వరమ్మ వద్ద 15, మహేశ్వరమ్మ వద్ద 18, ఉల్చాల గ్రామానికి చెందిన వడ్డె రామకృష్ణ వద్ద 16, వడ్డె సుంకులమ్మ వద్ద 30, ఇ.తాండ్రపాడు గ్రామంలో తెలుగు శ్రీనివాసులు వద్ద 25, గొల్ల రాంపుల్లయ్య వద్ద 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు.

క్షతగాత్రులకు పరామర్శ


గిద్దలూరు ఆస్పత్రిలో రైతులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్


ప్రమాద ఘటన వద్ద వివరాలు తెలుసుకుంటున్న సతీష్

సి.బెళగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సి.బెళగల్ మండలానికి చెందిన రైతులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ముడుమాల గ్రామానికి చెందిన రైతులు తెలుగు రమేష్, బోయ రంగన్న, గుండ్రేవుల గ్రామానికి చెందిన గొల్ల భాస్కర్ పోలకల్ గ్రామానికి చెందిన దేవరాజు వాహనంలో మిరప దిగుబడులను గుంటూరు మిర్చి యార్డుకు తరలిస్తున్నారు. అయితే రాత్రి గిద్దలూరుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. ముడుమాల గ్రామానికి చెందిన బోయ రంగన్న తీవ్రంగా గాయపడ్డారు. తెలుగు రమేష్, గుండ్రేవుల భాస్కర్, వాహన డ్రైవర్‌లు కూడా గాయపడడంతో స్థానికులు గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్ హుటాహుటిన సోమవారం అర్ధరాత్రి ఆస్పత్రికి చేరుకుని ప్రమాద బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌లకు సూచించారు. అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ


పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శాంతికళ

కల్లూరు: పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పి. శాంతికళ అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులు, రిపోర్టులు, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి తక్కువగా ఉందన్నారు. ఆరోగ్య కార్యక్రమాల సర్వేలను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత మాత్రమే వివాహాలు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. మూడేళ్లు తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వాడాలని, ఆ తరువాతనే తల్లికి అవసరమైన శరీర ఆకృతిని కలిగి ఉండడంతో పాటు గర్భం దాల్చడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ఆయా కార్యక్రమాలు, విషయాలను గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ నూకరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు

కర్నూలు(అర్బన్): గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో భాగంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించి ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌బీఎం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామాజిక సోక్‌పిట్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని పీఆర్అండ్ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనీల్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం అమరావతి నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. 2 వేల జనాభా కలిగిన గ్రామానికి మూడు ప్రకారం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. అలాగే అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించి అవసరమైన, స్థల లభ్యత కలిగిన ఇంటికి వ్యక్తిగత కంపోస్టు పిట్లు, కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గ్రామాలను స్వచ్ఛమైన, బహిరంగ మల విసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా శాఖలు సమష్టిగా కృషి చేయాలన్నారు.

ఆడపిల్ల చదువు.. ఇంటికి వెలుగు


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఐఓ

కోడుమూరు రూరల్: ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగునిస్తుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ నాగప్రసాద్ బాబు సూచించారు. మంగళవారం గూడూరు బాలికల హైస్కూల్‌లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలిక విద్యా ప్రాధాన్యతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. చదువుతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనవసర విషయాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష, హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్ణారెడ్డి, సూపర్‌వైజర్ రాఘవయ్య, హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే అధిక కూలి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలంతా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మంగళవారం కోడుమూరులో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 వరకు వస్తుందని, కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వెళ్లి మధ్యాహ్నం 12లోగా పనులు ముగించుకుని వెళ్లాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఒకరి బదులుగా మరొకరు పనుల్లోకి రాకూడదని, ఎవరి పేరు ఉంటే వారే పనుల్లో ఉండాలని సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వెంటనే వారికి ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

1న రౌండ్ టేబుల్ సమావేశం

పాణ్యం: నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు వచ్చే నెల ఒకటో తేదీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజు నాయుడు తెలిపారు. ప్రజా సమస్యలతో పాటు మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: గీత కులాలకు(ఈడిగ) సంబంధించి కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని క్రిష్ణగిరి మండలానికి ప్రభుత్వం ఓ మద్యం దుకాణం కేటాయించిందని.. అర్హులైన వారు ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నాన్ రీఫండబుల్ ఫీజు రూ.2 లక్షలు చెల్లించి కుల ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 7వ తేదీ లక్కీ డ్రా తీసి పేరు వచ్చిన వారికి మద్యం షాపు కేటాయిస్తారని తెలిపారు.

మద్దతు ధరతో కందుల కొనుగోలు


గూడూరులో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కర్నూలు ఏడీఏ సాలురెడ్డి


పులకుర్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పండించిన కందులను ప్రభుత్వం క్వింటాల్ రూ.7550 మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. మంగళవారం గూడూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసి, పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి గరిష్టంగా 100 క్వింటాళ్ల వరకు ప్రభుత్వం కందులను కొనుగోలు చేస్తుందని తెలిపారు. కందులను అమ్ముకోవాలనుకునే రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం ఏఈఓలుగా పదోన్నతి పొందిన సుధాకర్, భీమానాయక్, పులిరాజులను ఏడీఏతో పాటు, ఏఓలు శ్రీవర్ధన్‌రెడ్డి, దస్తగిరి, విజయ్‌కుమార్‌రెడ్డి పూలమాలతో సత్కరించి అభినందించారు. అలాగే కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామంలో ఏఓ రవిప్రకాష్ వేరుశనగ, మొక్కజొన్న సాగుపై పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

కంది విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఓర్వకల్లు: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన కంది పంట విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. మండలంలోని పూడిచెర్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ పంటను సందర్శించి రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు ఇచ్చారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుతో పాటు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని పేర్కొన్నారు. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో వేసిన కంది పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా ఓర్వకల్లు సొసైటీ వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. క్వింటా కంది రూ.7550 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కంది పంట సాగుచేసిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ భాస్కర్, వీఏఏ అమీర్‌ఖాన్, రైతులు పాల్గొన్నారు.


ఓర్వకల్లులో..

12 శాతం తేమతో కందులు కొనుగోలు

సి.బెళగల్: రైతులు పండించిన కందులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాల్లో కందులు అమ్మకాలు చేపట్టే రైతులు కంది గింజల్లో 12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. 12 శాతం తేమ శాతం ఉండే కందులు క్వింటా రూ.7,550గా ఉందన్నారు. కందుల విక్రయాల కోసం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. వీఆర్వో తిమ్మన్న, ఏఈఓ హిమబిందు, వ్యవసాయ సహాయకులు భరత్, అఫ్రీన్, ఎంపీఈఓ వెంకటేష్ ఉన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): జిల్లా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ), మండల స్థాయి లీగల్ సర్వీసెస్ (ఎంఎల్ఎస్‌సీ)లలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి పాసై ఉండి...ఆపై ఉన్నత చదువులు చదివి చట్టం, సామాజిక రంగాల్లో పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుల కోసం జిల్లా స్థాయి లీగల్‌సర్వీసెస్ అథారిటీ లేదా మండల స్థాయి లీగల్ సర్వీస్‌లను ఆశ్రయించి పొందాలని, పూరించిన దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా మండలస్థాయి లీగల్ సర్వీసెస్‌కు స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చని వివరించారు.

ఇండస్ట్రియల్ అప్రెంటిషిప్‌పై శిక్షణ


అధ్యాపకులతో జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి

కర్నూలు (సిటీ): ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆర్‌డీఎస్‌డీఈ (రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) విజయవాడ ఆధ్వర్యంలో ఒకేషనల్ లెక్చరర్స్, విద్యార్థులకు ట్వాట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వృత్తి, విద్య అభ్యసించేవారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌డీఎస్‌డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ బి.అప్పారావు మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరే ముందు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి అప్రెంటిషిప్ ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమలు సైతం అప్రెంటిషిప్ శిక్షణ పొందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒకేషనల్ జూనియర్ లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు


పాతబస్టాండ్ ప్రాంతంలో వెళ్తున్న భారీ వాహనం

గడివేముల: జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు గడివేముల గ్రామంలోకి నిత్యం వస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో గంటల తరబడి ట్రాఫిక్‌జాం అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గురువారం గడివేములలో సంత కావడంతో ఆరోజు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం మీదుగా కర్నూలుకు వెళ్లాల్సి ఉండగా మైలేజ్ కొసం గడివేముల మీదుగా భారీ వాహనాలను నడుపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో పాతబస్టాండ్ ప్రాంతంలో లారీల కిందపడి ఇద్దరు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోకి భారీ వాహనాలు రాకపోకలు నియంత్రించి, తమ ప్రాణాలను కాపాడాలని స్థానికుల కోరుతున్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం


మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న వైద్యాధికారి

కోడుమూరు రూరల్: సిగరెట్, గుట్కా, ఖైనీ, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌లో ఎంఈఓ తైమూర్‌బాషా ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసికంగా, ఆర్థికంగా నష్టపోవడంతో పాటు క్యాన్సర్, లివర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడతారన్నారు. చదువులు, ఆటల్లో భావోద్వేగపరమైన ఒడిదుడుకుల వంటి లక్షణాలతో చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకునే ప్రమాదముందన్నారు. విద్యార్థులు తమ చక్కటి భవిష్యత్ కోసం మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు, మంచి స్నేహితుల సహవాసం, యోగా, వ్యాయామం వంటి వాటిపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కోలోకెటెడ్ వైద్యాధికారి మదనశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, హెడ్ నర్సు లక్ష్మిదేవి, కౌన్సిలర్ శ్వేత పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పంచలింగాల గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాదక ద్రవ్యాల నివారణ, నిర్మూలన, బాల్య వివాహాలు, మానసిక ఆరోగ్యం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురవుతున్న వారితో పాటు ఎలాంటి సమస్యలు ఉన్న విద్యార్థులైనా 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. మానసిక నిపుణులు సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను వివరిస్తారన్నారు. విద్యార్థి దశ కీలకమని.. భవిష్యత్తు ఈ దశపైనే అధారపడి ఉంటుందని తెలిపారు. చెడు అలవాట్లు చేసుకుంటే జీవితం దుర్భరంగా మారుతుందని హెచ్చరించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయని.. మొదటి దశలోనే గుర్తిస్తే సరైన కౌన్సెలింగ్ ద్వారా నయం చేసుకోవచ్చని చెప్పారు. వ్యాయామం, యోగా దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, ఎంపీహెచ్‌ఓ మగ్బూల్, మల్లికార్జున భవ్య తదితరులు పాల్గొన్నారు.